ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు

జిల్లా వార్తలు

శుక్రవారం 19 జూలై 2024



రెండు వర్గాల మధ్య గొడవ



రాళ్ల దాడి అనంతరం టీడీపీ శ్రేణులు దహనం చేసిన రెడ్డెప్ప కారు



మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపైకి చేరిన వైసీపీ శ్రేణులు.. ఇక్కడ్నుంచే టీడీపీ వారిపై రాళ్ల దాడి చేశారు

పుంగనూరులో ఉద్రిక్తత

- రైతులతో కలిసి రాజంపేట ఎంపీని కలిసేందుకు వెళ్లిన టీడీపీ శ్రేణులు
- పోలీసులు అడ్డుకున్నా.. మాజీ ఎంపీ ఇంటికి చేరుకున్న ఆందోళనకారులు
- గో బ్యాక్ మిథున్, ముంపు రైతులకు న్యాయం చేయాలంటూ నినాదాలు
- వైసీపీ శ్రేణుల దాడిలో 12 మందికి గాయాలు
- ఆగ్రహంతో ఒక వాహనం దహనం.. మరికొన్ని ధ్వంసం

పుంగనూరు, జూలై 18: పుంగనూరులో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైసీపీ పాలనలో సాగించిన ఆరాచకాలు, దాడులు, రైతులకు పరిహారం ఇవ్వకనే రిజర్వాయరు కట్టడం వంటి చర్యల నేపథ్యంలో పెద్దిరెడ్డి కుటుంబీకులను కూటమి శ్రేణులు అడ్డుకుంటున్నారు. ఎమ్మెల్యే, రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరుకు రాకుంటేనే ప్రశాంతంగా ఉంటామంటూ గతంలో వీరి పర్యటనలను అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి గురువారం ఉదయం పుంగనూరు కొత్త ఇండ్లలోని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికి చేరుకున్నారు. దీంతో పరిహారం కోసమని రిజర్వాయరు ముంపు రైతులను వెంటబెట్టుకుని ఎంపీని కలవడానికి టీడీపీ శ్రేణులు ర్యాలీగా బయలుదేరారు. ప్రాజెక్టు ముంపు రైతులకు న్యాయం చేయాలి.. గోబ్యాక్ మిథున్‌రెడ్డి.. అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఎక్కడికక్కడ టీడీపీ శ్రేణులను నిరోధించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమ కేసులు, వేధింపులు, దాడుల్లో బాధితులైన టీడీపీ కార్యకర్తలు, రైతులు ఆగ్రహంతో ఎంపీ మిథున్‌రెడ్డిని నిలదీసేందుకు బయలుదేరారు. పోలీసులు అడ్డుకున్నా.. వివిధ మార్గాల గుండా భారీ సంఖ్యలో మాజీ ఎంపీ ఇంటికి చేరుకున్నారు. కాగా, మిథున్‌రెడ్డికి రక్షణగా పుంగనూరులోని కొంతమంది, తిరుపతి, చిన్నగొట్టికల్లు, మదనపల్లె, బైరెడ్డిపల్లె, పలమనేరు తదితర ప్రాంతాల నుంచి వందమందికిపైగా వచ్చారు. వీరిలో చాలామంది రెడ్డెప్ప ఇంటిపైన ఉన్నారు. తన ఇంటి వద్దకు వచ్చిన టీడీపీ శ్రేణుల వద్దకు రెడ్డెప్ప వెళ్లి ఎంపీ తన ఇంటికి టిఫిన్‌కు వచ్చారని షటిల్ కోర్టు చూసుకుని వెళ్లిపోతారని గొడవ చేయరాదని వారించారు. తాము గొడవ చేయడానికి రాలేదని, నేతిగుట్లపల్లి ప్రాజెక్టు ముంపు రైతులకు మద్దతుగా వారికి న్యాయం జరిగేలా వచ్చామని టీడీపీ శ్రేణులు చెప్పారు. అక్కడ్నుంచి ఎవరూ వెళ్లకపోవడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి తరిమేశారు.

అదే సమయంలో మిద్దెపై నుంచి వైసీపీ శ్రేణులు రాళ్ల, కర్రలు, సీసాలతో కిందనున్న టీడీపీ వారిపై దాడులకు దిగారు. కిందనున్న వారు కుర్చీలతోనూ దాడి చేశారు.

ముందుగానే దాడులకు సిద్ధమయ్యారా?

టీడీపీ శ్రేణులు వస్తే.. వివాదం జరిగితే దాడి చేసేందుకు వైసీపీ శ్రేణులు ముందస్తుగా సిద్ధమయ్యారా? ఇక్కడి ఘటనను పరిశీలిస్తే.. ఈ ప్రశ్నకు అవుననే సమాధానమే వస్తోంది. ఎందుకంటే.. రెడ్డెప్ప ఇంటి వద్ద టీడీపీ, వైసీపీ శ్రేణులను పోలీసులు చెదరగొట్టారు. ఆ తర్వాత మిద్దెపై నుంచి ఒక్కసారిగా రాళ్ల, బాటిళ్ల, కర్రలతో వైసీపీ శ్రేణులు దాడి చేశారు. అంటే.. ముందుగానే వీటిని మిద్దెపైకి తీసుకెళ్లి సిద్ధంగా ఉండుండాలి. టీడీపీ శ్రేణులూ ఇదే అనుమానాన్ని వ్యక్తంచేస్తున్నాయి.



గాయపడిన ఎస్టీఎఫ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి

వాహనాల ధ్వంసం



ధ్వంసమైన మిథున్‌రెడ్డి కారు

రాళ్లదాడితో టీడీపీ శ్రేణులను వైసీపీ వారు గాయపరచడంతో వీరంతా కోపోద్రిక్తులయ్యారు. ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్పతోపాటు మరికొందరు వైసీపీ నేతల వాహనాలను ధ్వంసం చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి వాహనంలో ఓ కత్తిని గుర్తించారు. ఒక వాహనానికి నిప్పు పెట్టి దహనం చేశారు. దట్టమైన పొగ, టైర్ల పెలుళ్ల శబ్దం, పోలీసు బలగాల మొహరింపు, వైసీపీ, టీడీపీ శ్రేణుల రాకతో కొత్త ఇండ్లు ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనల నేపథ్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు.. 6.30 గంటల పాటు మిథున్‌రెడ్డి ఇంట్లోనే గడిపారు. ఆ తర్వాత పోలీసులు టీడీపీ శ్రేణులు, రైతులకు నచ్చచెప్పి పంపడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. పోలీసు బందోబస్తు నడుమ చిత్తూరు ఏఎస్పీ ఆరీఫుల్లా తన వాహనంలో మిథున్‌రెడ్డిని తిరుపతికి తీసుకెళ్లారు. వైసీపీ శ్రేణులు కూడా ఒక్కొక్కరిగా వెళ్లిపోయారు. చిత్తూరు ఏఎస్పీ ఆరీఫుల్లా, డీఎస్పీలు విష్ణురఘువీర్, మహబూబ్‌బాషాతో పాటు చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు బలగాలు చేరుకున్నాయి.

ఒక కానిస్టేబుల్, 12 మంది టీడీపీ శ్రేణులకు గాయాలు



గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ శ్రేణులు

రెడ్డెప్ప ఇంటి వద్ద జరిగిన వైసీపీ దాడుల్లో 12 మంది టీడీపీ శ్రేణులు, ఒక కానిస్టేబుల్‌కు రక్తగాయాలయ్యాయి. వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పుంగనూరు మండలానికి చెందిన టీడీపీ కార్యకర్త అస్రఫ్ చెవిపై రాయి దెబ్బ తగలడంతో అతను అక్కడికక్కడే కుప్పకూలారు. టీడీపీ శ్రేణులు వెంటనే అతడిని వైద్యశాలకు తరలించారు. అజీం, నూర్‌షా, సుధాకర్, నాగరాజ, సయ్యద్, సుహేల్‌భాషా, వివేక్, షామీర్, ప్రసాద్‌స్వామి, సల్మాన్, సయ్యద్, పెద్దమోహన్‌నాయుడు, ఎస్టీఎఫ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తితో పాటు ఇద్దరు జర్నలిస్టులకూ గాయాలయ్యాయి. 'ఎన్నికల అనంతరం ముంపు భూములకు పరిహారం ఇస్తామని ఎంపీ మిథున్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. దీనిపై తాము వెళ్లి ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించగా వైసీపీ రౌడీలు దాడులు చేశారు. బీభత్సం సృష్టించి హత్యాయత్నానికి పాల్పడ్డారు' అంటూ ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పతో పాటు పలువురిపై టీడీపీ నేత సుహేల్‌బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు: వైసీపీ

కాలం ఎల్లప్పుడూ ఒకేలా ఉండదని, మార్పు ఉంటుందనే విషయాన్ని టీడీపీ గుర్తించాలని ఎంపీ మిథున్‌రెడ్డి మీడియా సమావేశంలో సూచించారు. తమ నేతలు, మద్దతుదారులపై దాడులను ప్రోత్సహించి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. మాజీ ఎంపీ ఇంటిపై రాళ్ల రువ్వడం, దాడిచేయడం దారుణమన్నారు. అధికారం శాశ్వతం కాదని, దాడుల సంస్కృతి మంచిది కాదని ఎంపీతో పాటు మాజీ ఎంపీ రెడ్డెప్ప అన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబ పాపాలతోనే తిరుగుబాటు: మంత్రి

పుంగనూరు/రొంపిచెర్ల: పుంగనూరులో పెద్దిరెడ్డి కుటుంబం 15ఏళ్లుగా చేసిన పాపాలు, దోపిడీలతోనే ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రొంపిచెర్లలో చల్లా బాబు ఇంటి వద్ద మీడియా సమావేశంలో.. 'ఆంధ్రజ్యోతి'తోనూ ఆయన మాట్లాడారు. 'ఎంపీ మిథున్‌రెడ్డి గుట్టుచప్పుడు కాకుండా తిరుపతి నుంచి పుంగనూరుకు దొంగలా వచ్చి గొడవలు సృష్టించి ప్రజల్లో విద్వేషం పెంచాలని ప్రయత్నించారు. రైతులను నష్టపరిహారం ఇస్తామని పిలిపించగా వారికి మద్దతుగా వెళ్లిన టీడీపీ శ్రేణులపై వైసీపీ రౌడీలు రాళ్ల దాడులు చేయడం దారుణం. టీడీపీ అధికారంలోకి వచ్చి 40 రోజులు అవుతున్నా పెద్దిరెడ్డి కుటుంబం గతంలోలాగే గొడవలు చేసే సంస్కృతి మానుకోలేదు. పెద్దిరెడ్డి కుటుంబం చేసిన దౌర్జన్యాలు, భూదోపిడీ, అక్రమ కేసులపై చట్టప్రకారం చర్యలు ఉంటాయి' అని స్పష్టంచేశారు. పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు గతంలోలాగే దాడులు చేస్తే ప్రతి దాడులు తప్పవని మంత్రి హెచ్చరించారు. జగన్మోహన్‌రెడ్డిలా చంద్రబాబునాయుడు తప్పులు చేయరని, గాంధీ మార్గంలో ప్రజల సమస్యలు తీర్చడం తమకు నేర్పారని చెప్పారు. 'మీలా 35 మంది పోలీసులను అడ్డుపెట్టుకొని మేము తిరగలేదు. మీలాగా దొంగ కేసులు పెట్టలేదు. ప్రిస్టేజ్ కోసం, అక్రమంగా సంపాదించిన, ఆక్రమించిన ఆస్తులను కాపాడుకోవడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు' అంటూ ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలపై జరిగిన దాడుల ఫొటోలను ఆయన చూపారు.



వైసీపీ దాడుల ఫొటోలు చూపుతూ రొంపిచెర్లలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి

నీతులుమాని గతం గుర్తుచేసుకో మిథున్

నియోజకవర్గం ప్రశాంతంగా ఉండేదనే నీతులు చెప్పడం మాని గతంలో పుంగనూరు, కల్లూరు, సోమల మండలం నంజంపేటలో జరిగిన ఘటనలు గుర్తు చేసుకొని మాట్లాడాలని ఎంపీ మిథున్‌రెడ్డికి చల్లారామచంద్రారెడ్డి సూచించారు. రాగాలపల్లె ప్రాజెక్టుతో 250 ఎకరాలు భూములు కోల్పోయిన రైతులు రోడ్డు మీదకు వస్తే తిరుపతి నుంచి రౌడీలను తీసుకొచ్చి దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. '20 రోజులుగా ఉనికి కోసం అల్లర్లు సృష్టించాలని మిథున్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ప్రాజెక్టుల పేరుతో బిల్లులు చేసుకుని రైతులను మోసం చేశారు. రాగానిపల్లె వద్ద 958 ఎకరాలు స్వాహా చేశారు. ఇసుక, గ్రానైట్ అక్రమాలతో అందరినీ ఇబ్బంది పెట్టారు. దీంతో ప్రజలు ఆవేశంగా ఉన్నారు. చంద్రబాబు పాలనలో పుంగనూరు మళ్లీ ప్రశాంతంగా ఉంటుంది' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామనాథం నాయుడు, ఉయ్యాలరమణ, రమేష్‌రెడ్డి, ధనంజయనాయుడు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15 ఏళ్లు నాశనం చేశారు : టీడీపీ

ప్రశాంతమైన పుంగనూరులో అడుగుపెట్టి 15 ఏళ్లుగా అరాచకాలు దౌర్జన్యాలు, దాడులు, దోపిడీలతో నాశనం చేశారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ ఆరోపించారు. ఎంపీ మిథున్‌రెడ్డి అధికార మదంతో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌ను ఇష్టమొచ్చినట్లు మాట్లాడారన్నారు. గతంలో తనపై దాడి చేసి.. ఇంటిని దహనం చేశారన్నారు. 'టీడీపీ ఎక్కడా దౌర్జన్యాలకు దిగదు. రైతులకు న్యాయం కోసం పోరాడుతుంది. గతంలో చిత్తూరు ఎస్పీ చారుసిన్హాను అగౌరవంగా మాట్లాడిన చరిత్ర పెద్దిరెడ్డిది' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీ రెడ్డి, సుహెల్‌బాషా, సద్దాం, పోలీసుగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం పేరుతో నిధుల స్వాహా!

- ఆటోలు, మైక్‌సెట్ల ప్రచార బిల్లు రూ.17 లక్షలట
- నగరపాలక రెవెన్యూ విభాగంలో అవినీతి దందా

చిత్తూరు, జూలై 18: అరకొర నిధులతో అభివృద్ధి చేయలేక కొట్టుమిట్టాడుతున్న చిత్తూరు నగరపాలక సంస్థలో కొందరు నిధులను తేరగా స్వాహా చేశారు. మైక్‌సెట్లతో ఆటోల్లో తిరగకుండానే ప్రచారం చేసినట్లు బిల్లులు చేసుకున్నారు. రెవెన్యూ విభాగంలో చోటుచేసుకున్న ఈ అవినీతి బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆస్తి పన్నుల చెల్లింపుపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడానికి ఆటోలు, మైక్‌సెట్లను వినియోగించినట్లు రూ.లక్షల్లో బిల్లు చేసుకున్నారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 41వేల ఆస్తి పన్ను అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఏడాదికి ఆస్తి పన్ను వసూలు లక్ష్యం రూ.28 కోట్ల వరకు ఉంటుంది. లక్ష్యాన్ని చేరుకోవాలనే ప్రయత్నాన్ని పక్కన పెట్టి, ఆస్తిపన్నులు సకాలంలో చెల్లించాలనే అంశాన్నే ప్రధాన ఆదాయవనరుగా కొందరు మార్చుకున్నారు. గతేడాది సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో 10 ఆటోలకు రూ.21వేలు అంటే రోజుకు ఒక్కో ఆటోకు రూ.2100. ఇలా 90 రోజులకు రూ.17.14 లక్షల వరకు బిల్లులు పెట్టి చెల్లింపులు చేపట్టారు. మొదటి విడతగా రూ.5.98 లక్షలు, రెండో విడతలో 11.15 లక్షలకు సంబంధించి చెక్కులను ఇచ్చేశారు. కనీసం టెండర్లు కూడా పిలవకుండానే 10 ప్రైవేటు ఆటోలతో ఆస్తిపన్ను బకాయిపై నగరంలో మైక్‌సెట్లతో ప్రచారం చేశారు. అయితే, మూడు నెలలపాటు ఆటోలు నగరంలో తిరగలేదని ప్రజలు అన్నారు. విలీనమైన 14 పంచాయతీలతో పాటు 50 డివిజన్లలో సగం డివిజన్లలో కూడా ఆటోలు తిరగలేదని నగరపాలక అధికారి ఒకరు చెప్పారు. నగరం నడిబొడ్డున నాలుగు వీధుల్లో తిరిగేసి 90 తిరిగినట్లు బిల్లులు సిద్ధంచేసి చెల్లింపులు చేసినట్లు విమర్శలున్నాయి. రోజుకు ఎన్ని కిలోమీటర్లవరకు ఆటోలు తిరిగాయి? ప్రచారం చేసినప్పుడు విధుల్లో ఉన్న నగరపాలక సిబ్బంది ఎవరనే విషయాన్ని గోప్యంగా ఉంచారు. దీనిపై సామాజిక కార్యకర్తలు సైతం సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. తాము చెల్లించే పన్నులతో రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. అధికారులే ఇలా దొంగ బిల్లులు పెట్టి డబ్బులను స్వాహా చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గత కొంతకాలంలో వివిధ విభాగాల్లో అవినీతి అక్రమాలు తారస్థాయికి చేరాయి.ఇటీవల ఒక్కొక్కటిగా బయటికి వస్తునాయి. ఇప్పటికైనా నగరపాలకసంస్థలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ప్రజలు కోరుతున్నారు.

ద్రావిడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా దొరస్వామి



గుడుపల్లె, జూలై 18: ద్రావిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా ద్రావిడ వర్సిటీలోని గ్రంథాలయం శాఖలో ఆచార్యుడిగా పనిచేస్తున్న ఎం.దొరస్వామిని నియమిస్తూ బుధవారం గవర్నర్ కార్యదర్శి సౌరబ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు వీసీగా ఉన్న ఆచార్య మధుజ్యోతి జూన్ 28న తన పదవికి రాజీనామా చేశారు. అప్పట్నుంచి ప్రభుత్వం వీసీని నియమించలేదు. 20 రోజుల తర్వాత ఇన్‌చార్జి వీసీని నియమించారు. ఇన్‌చార్జి వీసీగా ఆచార్య దొరస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. బోధన, పాలన అనుభవం ఉన్న ఈయన నియామకం పట్ల ఉద్యోగులు, పరిశోధకులు, సిబ్బంది హర్షం వ్యక్తంచేశారు.

ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ ధరించండి



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా న్యాయమూర్తి భీమారావు

చిత్తూరు లీగల్, జూలై 18: ద్విచక్రవాహనాల్లో వెళ్లే ప్రతిఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు సూచించారు. చిత్తూరులోని జిల్లాకోర్టులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెన్నెల ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై గురువారం సాయంత్రం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజే మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. చాలా మంది హెల్మెట్ ధరించక వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల్లో మరణిస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 90శాతం ద్విచక్రవాహనం నడిపేవారివల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించాలంటే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. జిల్లా కోర్టునుంచి హైరోడ్డు మీదుగా గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో పీపీ లోకనాథ రెడ్డి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

రెస్కో ఉద్యోగుల్లో వణుకు

- అవకతవకలపై విచారణ
- రికార్డులు తీసుకెళ్లిన విచారణాధికారి శ్రీలక్ష్మి



విచారణకు సిద్ధం చేసిన రికార్డులు

కుప్పం, జూలై 18: వైసీపీ ప్రభుత్వ హయాంలో కుప్పం రెస్కోలో జరిగిన అక్రమాలు, అవినీతిపై సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మి గురువారం విచారణ చేపట్టారు. దీంతో ఉద్యోగుల్లో వణుకు మొదలైంది. తొలుత కార్యాలయానికి చేరుకున్న శ్రీలక్ష్మి ఉద్యోగులను విచారించారు. ఫైళ్లను పరిశీలించారు. రెస్కో మాజీ, తాజా మాజీ ఎండీల పదోన్నతులు, 122మంది ఉద్యోగుల నియామకాలు, పదోన్నతులు ఇచ్చిన విధానాలపై వివరణ కోరారు. అక్రమ నియామకాలు, నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు, విడి భాగాల కొనుగోళ్ల తదితరాలపై అధికారులను ప్రశ్నించారు. ఒక సీనియర్ అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్టుమెంటులో చేరి అక్రమాలకు కారణమైన విధానాన్ని నిలదీశారు. ఏడాది పాటూ సస్పెండైన విషయాన్ని దాచిపెట్టి సదరు ఉద్యోగికి ఎలా పదోన్నతి కల్పిస్తారని ఆమె ప్రశ్నించారు. ఆయా రికార్డులన్నింటినీ ఆమె తనతో పాటూ తీసుకెళ్లారు. అంతకు ముందు విచారణాధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. నాలుగు నెలల్లో విచారణ ముగించి, ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.



రెస్కో కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి

తిరుపతి ఆర్డీవోను విచారించిన సీఐడీ

రెండు రోజుల్లో సమాచారం ఇవ్వాలంటే వారం వ్యవధి కోరిన ఆర్డీవో నిశాంత్‌రెడ్డి

తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని సీఐడీ అధికారులు గురువారం విచారించారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు పలు అంశాలపై సమాచారం కోరారు. కోరిన సమాచారాన్ని రెండు రోజుల్లో ఇవ్వాలని సూచించారు.గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో సీఐడీ డీఎస్పీ పద్మలత, సీఐ రామకిషోర్, ఎస్‌ఐ మంజుల సిబ్బందితో కలసి ఆర్డీవో కార్యాలయం చేరుకున్నారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని ఆయన ఛాంబర్‌లో కలసి పలు అంశాలపై విచారించారు. ఈ సందర్భంగా తమకందిన ఫిర్యాదులో పేర్కొన్న మేరకు చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితాలో మార్పు చేర్పులు, తొలగింపులకు సంబంధించి కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. అయితే ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు వంటివాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆర్డీవో చెప్పినట్టు తెలిసింది. అలాంటప్పుడు చంద్రగిరి గత ఎమ్మెల్యే ప్రైవేటు కార్యాలయానికి తరచూ ఎందుకు వెళ్ళాల్సి వచ్చిందని, అక్కడికి నియోజకవర్గంలోని తహసీల్దార్లను ఎందుకు పిలిపించాల్సి వచ్చిందని సీఐడీ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. దీనికి ఆర్డీవో తాను ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్ళడంలో తప్పేంవుందని ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. ప్రభుత్వ పనులపై తాను ఎమ్మెల్యేను కలవడం, ఆయన కార్యాలయానికి వెళ్ళడం తప్పెలా అవుతుందని, తహసిల్దార్లను పిలిపించడం కూడా తప్పేమీ కాదని సమాధానమిచ్చినట్టు తెలిసింది. ఓటర్ల జాబితాకు సంబంధించి తనపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని, తన ప్రమేయం ఏమీ లేదని చెప్పినట్టు తెలిసింది. సుమారు గంటపాటు సీఐడీ అధికారులు ఆర్డీవో ఛాంబర్‌లో గడిపి అవసరమైన సమాచారం సేకరించే ప్రయత్నం చేసి అనంతరం వెనుదిరిగారు.

వెటర్నరీ వర్సిటీలో నిధుల దుర్వినియోగం

- వైసీపీ పాలనలో లాయర్ల ఫీజుకింద రూ.96లక్షల ఖర్చు
- స్టాండింగ్ కౌన్సిల్ ఉన్నా.. అదనపు న్యాయవాదుల నియామకం
- లీగల్ ఖర్చులపై ఎల్ఎఫ్ ఆడిట్ అధికారుల అభ్యంతరం

తిరుపతి రూరల్, జూలై 18 : తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో లీగల్ ఖర్చుల కింద గత వైసీపీ పాలనలో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న విమర్శలు రేగాయి. వర్సిటీ ఉద్యోగుల పదోన్నతులు, బకాయిలు, నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నియామకాలు తదితర కేసులకోసం ప్రభుత్వ ధనాన్ని న్యాయవాదుల ఫీజు కింద దాదాపు రూ.96లక్షలు ఖర్చు చేసినట్లు సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన సమాధానంలో బయటపడింది.హైకోర్టులో వర్సిటీకి సంబంధించి కేసులు వాదించేందుకు 2020-2024సంవత్సరాలకు అప్పటి వైసీపీ ప్రభుత్వం స్టాండింగ్ కౌన్సిల్‌గా కె.రామమోహన రావును నియమించింది. ఈయనకు గౌరవ వేతనంగా నెలకు రూ.20వేలు అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది.దీని ప్రకారం ఈయనకు నాలుగేళ్లకు దాదాపు రూ.10లక్షలు గౌరవవేతనం ఇవ్వాల్సివుండగా.. ప్రభుత్వ అనుమతి లేకుండా నియమించిన ఇతర న్యాయవాదులతో కలిపి రూ.96లక్షలు మంజూరు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే అదనంగా పొన్నవోలు సుధాకర రెడ్డి(ఏఏజీ), వైవీ రవిప్రసాద్, పీవీ సుధాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డిలను న్యాయవాదులుగా నియమించి వర్సిటీ అధికారులు ప్రభుత్వ ధనాన్ని వృదా చేశారు. దీనికితోడు అప్పట్లో ఏఏజీగా ఉన్న పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి కూడా ఫీజు చెల్లించారని, నిబంధనల ప్రకారం ఆయనకు ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన కేసులకు ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదంటున్నారు. లోకల్ న్యాయస్థానంలో కూడా ప్రభుత్వం నియమించిన స్టాండింగ్ కౌన్సెల్ వర్సిటీకి సంబంధించిన కేసులను ఎంగేజ్ చేయాల్సి ఉందని,అయితే ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇంటర్నల్‌గా వర్సిటీ ఉన్నతాధికారుల అనుమతితో మధుకర్‌రెడ్డి అనే న్యాయవాదిని నియమించి ఫీజు కింద రూ.6,85,200 చెల్లించారు. రెండునెలల కితం వర్సిటీలో నిర్వహించిన లోకల్‌ఫండ్(ఎల్ఎఫ్) ఆడిట్ అధికారులు ఈ ఖర్చులపై అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. కోర్టును ఆశ్రయించిన ఉద్యోగులతో నేరుగా మాట్లాడి పరిష్కరించుకునే చిన్నచిన్న సమస్యలకు కూడా న్యాయవాదులకు అనవసరంగా ఫీజుకింద డబ్బు చెల్లించారని చెబుతున్నారు.ఈ నాలుగేళ్లలో హైకోర్టులో దాదాపు 60కేసులు, సుప్రీంకోర్టులో 10కేసులు దాఖలు చేయడాన్ని బట్టి ఉద్యోగుల పట్ల వర్సిటీ పాలకులు అనుసరించిన వైఖరి ఏ విధంగా ఉందో స్పష్టమవుతోంది.అలాగే 2016-17లో ఇంటర్నల్ ఆడిట్ రిపోర్ట్ (రాయలసీమ, కోస్టల్ ఆంధ్రా జోన్) ప్రకారం గతంలోనూ అధికారులు చాకచక్యంగా నిధులను దుర్వినియోగం చేశారని.. కాంట్రాక్ట్ ఏజెన్సీలకు బ్యాంకు చెక్కులను సీరియల్‌గా ఇవ్వాల్సిఉండగా మధ్యమధ్యలో తమకు అనుకూలంగా మలచుకుని చెక్కులు అందించారని, మంత్లీ అకౌంట్స్‌లో నగదు లెక్కలు కూడా తారుమారు చేసినట్లు ఇంటర్నల్ ఆడిట్ రిపోర్ట్‌లో నివేదించారని అంటున్నారు. ఆ నిధులు ఏమయ్యాయన్నది ఇంతవరకు తేలలేదంటున్నారు. అప్పట్లో పోస్టల్ స్టాంప్స్‌లోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని, కంపెనీలకు కూడా డబుల్ పేమెంట్ చేశారని కూడా ఆ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. దీనిపై అప్పటి ఫైనాన్స్ అధికారులపై విచారణ చేసి తగు చర్యలు చేపట్టాలని ఆడిట్ రిపోర్ట్‌లో స్పష్టంగా నివేదించినా ఇప్పటివరకు వారిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం ఉద్యోగుల ఆరోపణలకు బలం చేకూర్చుతోంది. అలాగే 2020-21లో కూడా ఓ అధికారి(రాయలసీమ జోన్) కాంట్రాక్ట్ ఏజెన్సీలకు డబుల్ పేమెంట్ చేశారని, ఈ విషయం వెలుగులోకి వచ్చాక రెండు సంవత్సరాల తర్వాత ఏజెన్సీల నుంచి రికవరీ చేసినట్లు సమాచారం. ఈ అవకతవకలకు కారణమైన వారికి కనీసం మెమో ఇచ్చిన దాఖలాలు కూడా లేకపోవడమేమిటని ఉద్యోగులు నిలదీస్తున్నారు. కాగా వర్సిటీ ప్రధానకేంద్రంగా గతవారంరోజుల నుంచి అకౌంటెంట్ జనరల్ ఆడిట్(ఏజీ) జరుగుతోందని, వీటిపై లోతైన విచారణ చేపడితే నిజాలు వెలుగు చూసే అవకాశం ఉందని ఉద్యోగవర్గాలంటున్నాయి.



వెటర్నరీవర్సిటీ పరిపాలనా భవనం

గుప్త నిధుల ముఠా అరెస్టు


గుప్త నిధుల తవ్వకాల్లో పట్టుబడిన ముద్దాయిలు, పనిముట్లు, కారు

తవణంపల్లె, జూలై 18: గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని గాజులపల్లె సమీపంలోని పూర్ణచంద్రారెడ్డి మామిడి తోటలో గుప్త నిధుల కోసం బుధవారం రాత్రి నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన బిట్రగుంట దాసయ్య(53), కంచరాల శ్రీనివాసులు(55), శశికుమార్(52), శ్రీకాళహస్తి చెంచులక్ష్మి కాలనీకి చెందిన వేలు(44), రమేష్‌చంద్రన్(44), వెంకటరమణయ్య(65) తవ్వకాలు చేపట్టారు. నిధులు దొరక్కపోవడంతో వెనుతిరిగి వెళుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. అరగొండ నుంచి చిత్తూరు వైపు వస్తున్న కారులో తవ్వకానికి ఉపయోగించిన పనిముట్లు గుర్తించి, కారును స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురి అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ పథకం వేసిన శ్రీకాళహస్తి నాగులగుంటకు చెందిన రఘును అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు.

25న కాణిపాకం హుండీ లెక్కింపు

ఐరాల(కాణిపాకం), జూలై 18: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీ కానుకలను ఈనెల 25న ఆస్థాన మండపంలో లెక్కించనున్నట్లు ఈవో వెంకటేశు తెలిపారు. ఆ రోజున ఆలయ సిబ్బంది ఎవరూ సెలవు పెట్టరాదని పేర్కొన్నారు.

జనావాసాల్లోకి నెమలి

కల్లూరు, జూలై 18: పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లి పంచాయతీ ఎర్రంవాండ్లపల్లి గ్రామంలో గురువారం జాతీయ పక్షి నెమలి సంచరించింది. ఇళ్లపై తిరుగుతున్న నెమలిని గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. గ్రామానికి సమీపంలోని చలపతి గుట్టలో ఉన్న నెమలి గుంపు నుంచి ఈ నెమలి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.


ఎర్రంవాడ్లపల్లిలో ఇళ్లపై తిరుగుతున్న నెమలి

ఎడ్యుకేషన్ హబ్‌గా కుప్పం: కలెక్టరు

కుప్పం, జూలై 18: కుప్పం నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు కలెక్టరు సుమిత్‌కుమార్ తెలిపారు. కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన 'ప్రజావినతుల స్వీకరణ- పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. కుప్పం నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకే కుప్పంలో ప్రజా వినతుల స్వీకరణకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రజల నుంచి ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై వినతులు వస్తున్నట్లు చెప్పారు. సామాజిక పింఛన్లు, గృహనిర్మాణం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపైనా కొందరు అర్జీలిచ్చారన్నారు. ఈ వినతులను 15 రోజుల్లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం, ప్రగతిని తనతో పాటు జేసీ కూడా సమీక్షిస్తారన్నారు. డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. తాను 15 రోజులకు ఒకసారి కుప్పంలో పర్యటిస్తానన్నారు. నియోజకవర్గంలోని అన్ని సమస్యలను ఆరు నెలల్లోపు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జేసీ శ్రీనివాసులు, కడా పీడీ వికాస్ మర్మత్, డ్వామా పీడీ రాజశేఖర్, కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు, డీఆర్డీఏ, హౌసింగ్ పీడీలు తులసి, పద్మనాభం, టీడీపీ నియోజకవర్గ నేతలు మునిరత్నం, డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో వినతులను పరిశీలిస్తున్న కలెక్టరు

23 నుంచి కుప్పంలో భువనేశ్వరి పర్యటన

కుప్పం, జూలై 18: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 23, 24, 25 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తారని టీడీపీ వర్గాల తెలిపాయి. ఎన్నికలకు ముందు బూత్ ఇన్‌చార్జీలతో సమావేశమైన ఆమె అత్యధిక మెజారిటీలు వచ్చిన బూత్‌లను ఎన్టీయార్ ట్రస్టు తరఫున దత్తత తీసుకుంటానని హామీనిచ్చారు. అలాగే ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా ఆయా బూత్‌ల పరిధిలోని అన్ని కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేలా ఆసరా అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆమె నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అత్యధిక మెజారిటీ వచ్చిన బూత్‌లలో పర్యటించే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు తెలిపాయి.

పెళ్లికి నిరాకరించాడని.. యువతి ఆత్మహత్య

మృతదేహంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల నిరసన

ఐరాల(కాణిపాకం), జూలై 18: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఐరాల మండలం చిగరపల్లెలో గురువారం చోటుచేసుకుంది. కాణిపాకం ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. చిగరపల్లెకు చెందిన జగన్నాథం, చిట్టి దంపతుల పెద్ద కుమార్తె విద్య(22), జీడీ.నెల్లూరు వెంకటాపురానికి చెందిన దుర్గాప్రసాద్ ప్రేమించుకున్నారు. డిగ్రీ పూర్తయిన తర్వాత పెళ్లి చేసుకుందామని నిశ్చయించుకున్నారు. చిత్తూరులోని ప్రభుత్వ కళాశాలలో గత ఏడాది డిగ్రీ పూర్తి చేశారు. పెళ్లి చేసుకుందామని విద్యా దుర్గాప్రసాద్‌ను కోరిన ప్రతిసారీ వాయిదా వేస్తూ వచ్చాడు. గురువారం మరోసారి కోరడంతో పెళ్లికి నిరాకరించాడు. మనస్తాపానికి గురైన విద్య చిగరపల్లెలోని తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన తల్లిదండ్రులు చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అగరంపల్లె ఆర్చి వద్ద ఉంచి, నిరసనకు దిగారు. దుర్గాప్రసాద్‌ను శిక్షించాలని కోరారు. విషయం తెలుసుకున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అక్కడికి చేరుకుని బాధితులతో చర్చించారు. న్యాయం చేస్తామని చెప్పడంతో శాంతించారు. కాణిపాకం ఎస్‌ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



విద్య (ఫైల్ ఫొటో) - అగరంపల్లె ఆర్చి వద్ద శవంతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

రాజీనామా చేసిపో..

- అక్రమాలపై నిర్లక్ష్య సమాధానం చెప్పారని తహసీల్దారుపై ఎమ్మెల్యే ఆగ్రహం

పెనుమూరు, జూలై 18: 'మీకు ఇష్టం లేకపోతే ఉద్యోగానికి రాజీనామా చెసి వెళ్లిపోండి. ఏం మాట్లాడుతున్నారు' అంటూ తహసీల్దారుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పెనుమూరు హైస్కూల్‌లో కిట్ల పంపిణీకి ఎమ్మెల్యే థామస్ హాజరయ్యారు. మండలంలో జరిగిన అక్రమాలపై తహసీల్దారును ఆరా తీశారు. ఆయన అడిగిన వాటికి బదులు ఇవ్వకపోగా పొంతనలేని సమాధానంతో ఎదురుతిరిగి మాట్లాడటంతో ఎమ్మెల్యేతో పాటు అక్కడ ఉన్న నాయకులు సైతం ఆగ్రహించారు. పెనుమూరులోని సర్వే నంబరు 430లో అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడిగితే ఏమీ చేయలేదని సమాధానం చెప్పారు. గొల్లపల్లిలో ఓ రైతు పొలంలో వెళుతున్న కాలువపై అడిగినందుకు రైతు చెప్పినట్లు చేయలేమని తహసీల్దారు అన్నారు. దీంతో రాజీనామా చేసి వెళ్లిపో అంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఎన్‌టీఏ దరఖాస్తు గడువు పొడిగింపు

చిత్తూరు (సెంట్రల్), జూలై 18: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించినట్లు డీఈవో దేవరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖ 2024 జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపికకు ఇప్పటికే ముగిసిన దరఖాస్తు స్వీకరణ గడువును ఈనెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. 10 సంవత్సరాల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టీటీడీ ఇన్‌ఛార్జ్ సీవీఎస్వోగా గౌతమి

తిరుమల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఇన్‌చార్జ్ సీవీఎస్వోగా గౌతమిని నియమించారు. గతంలో సీవీఎస్వోగా ఉన్న నరసింహకిషోర్ బదిలీ అయిన విషయం తెలిసిందే. అయితే ఆ పోస్టుకు ప్రభుత్వం ఎవరిని నియమించలేదు. ఈ క్రమంలో టీటీడీ ఎడ్యుకేషన్, హెల్త్ జేఈవోగా ఉన్న గౌతమికి ఇన్‌చార్జ్ సీవీఎస్వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం ఆ స్థానంలో మరో ఐపీఎస్ అధికారిని నియమించే వరకు గౌతమి ఇన్‌చార్జ్ సీవీఎస్వో బాధ్యతలను చూడనున్నారు.

సర్పంచి బావపై హత్యాయత్నం

జగనన్న కాలనీ ఇళ్ల స్థల వివాదమే కారణం ● పాతగుంటలో ఉద్రిక్తత

వెదురుకుప్పం, జూలై 18: జగనన్న కాలనీ ఇళ్ల స్థల విషయమై ఏర్పడిన వివాదం హత్యాయత్నం వరకు దారి తీసింది. పాతగుంట సర్పంచి భువనేశ్వరి బావ బొజ్జారెడ్డి(60)పై (వైసీపీ), అదే గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు మునేంద్ర(30) గురువారం సాయంత్రం హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. వెదురుకుప్పం మండలం పాతగుంట గ్రామానికి సమీపంలో జగనన్న కాలనీకి స్థలం కేటాయించారు. పాతగుంటకు చెందిన సీహెచ్ మునీంద్ర జగనన్న కాలనీకి కేటాయించిన ప్రాంతంలో మూడు ఇళ్ల స్థలం కన్నా ఎక్కువ స్థలంలో ఇల్లు, షెడ్డు వేసుకున్నాడు. ఆ స్థలం తాను ఇతరుల వద్ద గతంలోనే కొనుగోలు చేశానని చెబుతున్నాడు. అయితే రెవెన్యూ అధికారులు ఇతని షెడ్డు ఉన్న స్థలాన్ని ఇతరులకు కేటాయించారు. ఈ వివాదం కొన్ని రోజులుగా జరిగి చివరకు సర్పంచ్ భువనేశ్వరి బావ బొజ్జారెడ్డి వద్దకు పంచాయితీ వెళ్లింది. రెండు ఇళ్ల స్థలం వదిలి మిగతా స్థలంలోనే షెడ్డు ఉండాలని మునేంద్రకు చెప్పారు. తాను కొనుగోలు చేసిన స్థలం కాబట్టి ఇవ్వడానికి ఆయన నిరాకరించాడు. బొజ్జారెడ్డి పలుమార్లు మునేంద్రపై ఒత్తిడి తేవడంతో పగ పెంచుకున్నాడు. గురువారం పాతగుంటలో మద్దేరి మునస్వామిరెడ్డి మృతి చెందగా అంత్యక్రియలకు బొజ్జారెడ్డి హాజరయ్యారు. అంతిమ యాత్రలో పాల్గొన్నాడు. శవాన్ని దించి కార్యక్రమాలు నిర్వహిస్తుండగా కొంత దూరంలో బొజ్జారెడ్డి సేదదీరుతుండగా మునేంద్ర తన వెంట తెచ్చుకున్న కంకీ కొడవలి (కత్తి లాంటిది)తో మెడపై, చేతి వేళ్లపై నరికాడు. ఆయన కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు మునేంద్రను పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఆ తర్వాత మునేంద్ర ఏమయ్యాడో తెలియడం లేదని పాతగుంట ప్రజలు తెలిపారు. గాయపడిన బొజ్జారెడ్డిని చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. సర్పంచ్ బంధువులు మునేంద్రకు చెందిన ఇళ్లపై దాడులు చేశారు. ఆస్తులు, ఇంటి ముందు ఉన్న ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనతో పాతగుంట గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న కార్వేటినగరం సీఐ సత్యబాబు, వెదురుకుప్పం పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు.




ధ్వంసమైన మునేంద్ర ఆస్తులు - హత్యాయత్నానికి పాల్పడిన మునేంద్ర - గాయపడిన బొజ్జారెడ్డి

రెవెన్యూ నిర్లక్ష్యమే కారణం

జగనన్న కాలనీ ఇళ్లకు స్థలాలు కేటాయించే సమయంలో క్షేత్ర స్థాయి సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం లేకుండా స్థలాలు కేటాయించి ఉంటే ఈ వివాదానికి అవకాశం ఉండేది కాదని అంటున్నారు. ఆదిలోనే ఏదో ఒకటి తేల్చి ఉన్నా సమస్య ఇంత వరకు వచ్చేది కాదని స్థానికులు అంటున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన రెవెన్యూ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రేమోన్మాదం

- గంజాయికి బానిసైన యువకుడి ఘాతుకం
- మూడేళ్ళుగా బాలిక వెంటబడి వేధింపులు
- అవ్వ మందలింపులతో కక్ష పెంచుకున్నవైనం
- వృద్ధురాలి గొంతుకోసి....మనవరాళ్ళపై ఇనుప రాడ్‌తో దాడి చేసి పరార్


మృతురాలు జయలక్ష్మి

తిరుపతి(నేరవిభాగం), జులై 18 : గంజాయి మత్తుకు బానిసైన ఓ జులాయి విచక్షణ కోల్పోయాడు.మూడేళ్లుగా వెంటబడి తిరిగినా తన ప్రేమను తిరస్కరించిందన్న కోపంతో ఆ యువతి కుటుంబంపై పగబట్టాడు. గురువారం చీకటిబడ్డాక ముఖానికి మాస్క్, తలకు టోపీ ధరించి వారింట్లో దూరాడు. ప్రేమ విషయంలో మందలించిందన్న కోపంతో ఆ యువతి నాయనమ్మ గొంతుకోసి చంపేశాడు.తరువాత ఆమె చెల్లెలి తలపై ఇనుప రాడ్‌తో మోది తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం మెట్లమీద ఎదురుపడిన ఆ యువతిపై కూడా ఇనుప రాడ్‌తో దాడి చేసి పరారయ్యాడు. తిరుపతి రాయల్‌నగర్‌లో గురువారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన నగరవాసులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది.పోలీసుల కథనం మేరకు... తిరుపతి రాయల్‌నగర్‌లో కాపురమున్న శ్రీనివాసులు బసవయ్య అండ్ కో పేరుతో శానిటరీ మార్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నాడు.రోజూ శ్రీనివాసులు తన భార్య రక్షతో కలసి దుకాణానికి వెళ్ళేవాడు. శ్రీనివాసులు ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తె ప్రేరణ(18) ఢిల్లీలో బీబీఏ చదువుతోంది. చిన్న కుమార్తె నియతి(14) ఇక్కడే 9వ తరగతి చదువుకుంటోంది.శ్రీనివాసులు ఇంటి ముందు కాపురమున్న తాపీ మేస్త్రీ నరసింహులు రెండవ కుమారుడు శ్రీనివాస్ తరచూ ప్రేరణను ప్రేమ పేరుతో వెంటబడి వేధించేవాడు.ఈ విషయమై ఆమె నాయనమ్మ జయలక్ష్మి (67) పలు సందర్భాల్లో అతడిని మందలించిందని సమాచారం.సెలవులు కావడంతో ఇటీవల ప్రేరణ తిరుపతికి వచ్చింది. దీంతో శ్రీనివాసులు ఆమెను తరచూ మానసికంగా వేధించడం ఎక్కువైంది.ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ప్రేరణ తన తల్లి రక్షతో కలిసి డ్రైవింగ్ నేర్చుకోవడం కోసం బయటకు వెళ్ళారు.చీకటి బడ్డాక శ్రీనివాస్ తలపై టోపీ, ముఖానికి మాస్కు ధరించి ఎదురింట్లో దూరాడు. సెకండ్ ఫ్లోర్‌లో వున్న జయలక్ష్మి దగ్గరకు వెళ్లి కిరాతకంగా గొంతు కోసి హతమార్చాడు.ఆపై ఫస్ట్ ఫ్లోర్‌కు వచ్చి అక్కడున్న నియతిని తలపై ఇనుప రాడ్‌తో మోది తీవ్రంగా గాయపరిచాడు.దీంతో ఆమె అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయింది. గ్రౌండ్ ఫ్లోర్‌కు దిగుతుండగా బయట్నుంచి వస్తున్న ప్రేరణ మెట్లమీద ఎదురుపడడంతో ఆమెపై కూడా ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. ఆమె తల్లి వద్ద స్కూటీ తాళాలు లాక్కున్న శ్రీనివాస్ కింద ఇంటి ముంగిట పార్కు చేసి వున్న బాధితుల స్కూటీలోనే పరారయ్యాడు.తీవ్రంగా గాయపడిన నియతి పరిస్థితి విషమంగా వుండడంతో ఆమెను ఎలైట్ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడ్డ ప్రేరణను కూడా ఆస్పత్రిలో చేర్చారు.ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందగానే ఎస్పీ సుబ్బరాయుడు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.డీఎస్పీ రవిమనోహరాచారి,సీఐలు మురళీమోహనరావు, జయనాయక్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు కూడా అక్కడికి చేరుకుని వివరాలు సేకరించే పనిలో పడ్డాయి.డాగ్ స్క్వాడ్ బాధితుల ఇంటి ముందు కాపురమున్న నరసింహులు ఇంటి వద్దకు వెళ్ళి ఆగిపోయింది. దీంతో పోలీసులు బాధితులను విచారించగా అసలు విషయం బయటపడింది.జయలక్ష్మి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. యూనివర్శిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ రాయల్‌నగర్‌కు చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రేరణతో మాట్లాడి పరామర్శించారు.నిందితుడు శ్రీనివాస్‌ను పట్టుకోవడం కోసం ఏఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో ఐదు బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలిస్తున్నారు.


స్కూటర్‌పై పరారవుతున్న శ్రీనివాస్

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు : కమిషనర్



సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు, జూలై18 : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించరాదని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సిబ్బందికి సూచిం చారు. గురువారం పట్టణంలో పలు మురుగునీటి కాలువల్లో పూడిక తీయిం చారు. మురుగునీటి కాలువ గట్లపై పెరిగిన పిచ్చిమొక్కలను సైతం తొలగిం పజేశారు. అనంతరం పారిశుధ్య సిబ్బందితో, తాగునీరు సరఫరాచేసే సిబ్బందితో, ఇంజినీరింగ్ అధికారులతో మున్సిపల్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. పారిశుధ్య చర్యలపై పలు సూచనలు చేశారు. అక్కడక్కడా డయేరియా వ్యాప్తి చెందుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ పట్టణంలో పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. తాగునీటి ట్యాంకులను, సంపులను వార్డు అమినిటీస్ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బంది పరిశీలిం చాలన్నారు.

వీధికుక్కల బెడదను తగ్గించండి



జిలాని సర్కిల్ వద్దనున్న వీధికుక్కలు

పలమనేరు, జూలై18 : పట్టణంలో వీధికుక్కల బెడద తప్పించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలో వీధికుక్కల సంఖ్య విపరీతంగా పెరిగి పోయింది. మాంసందుకాణదారులు, హోటళ్ల నిర్వాహకులు వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేస్తున్నారు. వీటికోసం కుక్కలు ఎగబడుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని జిలాని సర్కిల్, ఆదిఆంధ్రవీధి, మసీదు వీధి, పెద్దగాండ్లవీధి, జెండామఠం, కాకాతోపు, గాంధీనగర్ ప్రాంతాల్లో వీధికుక్కల బెడద తీవ్రంగా వుంది. పిల్లలు, మహిళలు కుక్కల బారినపడి పడుతున్నారు. అధికారులు స్పందించి వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



న్యాయవాదులు చేపట్టిన ర్యాలీ

పలమనేరు, జూలై18 : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం పలమనేరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వ హించారు. ఇందులో హెల్మెట్ వినియోగంపై వారికి అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు పైబడిన వారు మాత్రమే ద్విచక్రవాహనాలు నడపాలని తెలియజేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ. 10 వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అనంతరం వారు హెల్మెట్లు ధరించి ద్విచక్రవాహనాలపై పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో న్యాయ వాదులు పరమశివప్ప, లక్ష్మీపతి, బర్కత్, షరీఫ్, ఏజీపీ క్రిష్ణమూర్తి, సయ్యద్ ఇస్మాయిల్, చంద్రశేఖర్, మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కన్నయ్య, ఏఎస్‌ఐ రమేష్ పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యాన్ని అలవర్చుకోవాలి



రైతులకు టార్పలిన్ పట్టలు, డ్రమ్ములను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూలై 18: రైతులు ప్రకృతి సేద్యాన్ని అలవర్చుకోవాలని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణఆచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, ప్రధానకార్యదర్శి నరసింహులు, మాజీ అధ్యక్షుడు అంజినేయరెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలంలు కోరారు. గురువారం రామకుప్పం మండల సచివాలయంలో ప్రకృతి సేద్యం చేస్తున్న ఎస్సీ రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన టార్పలిన్ పట్టలు, డ్రమ్ములను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడకం తగ్గించాలన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా సాగు చేసిన వ్యవసాయోత్పత్తులకు మార్కెట్లో అధిక ధరలు ఉన్నాయన్నారు.

పేదలకు అన్నదానం



గుడిపాల, జూలై 18: మండలంలోని అన్నక్యాంటీన్‌లో గురువారం తుమ్మల నాగమ్మ, కృష్ణమనాయుడు వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు భారతి, విద్యావతి భోజన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, రవి నాయుడు, గోవింద గౌడ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం



గుడుపల్లెలో సభ్యత్వ నమోదు చేపట్టిన నాయకులు

రామకుప్పం/గుడుపల్లె , జూలై 18: రామకుప్పం, గుడుపల్లె మండలాల్లో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అమీర్, హరీష్‌లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మార్పు, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు వెల్లివిరియాలన్న ఉద్దేశంతో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పార్టీని స్థాపించారన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 28వరకు కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వం పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు 8105655636 నెంబరును సంప్రదించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పవన్, శ్రీకాంత్, సురేష్, సోము, భాస్కర్, హరీష్, షహీన్షా పాల్గొన్నారు.

ముగిసిన రామకోటి నామస్మరణ



రామకుప్పం, జూలై 18: రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె కోదండరామస్వామి భజనమందిరంలో తొలిఏకాదశి పర్వదినం సందర్భం బుధవారంగా తెల్లవారుజామున ప్రారంభమైన అఖండ శ్రీరామకోటి నామస్మరణ కార్యక్రమం గురువారం ఉదయం వరకు ఘనంగా ముగిసింది. నామస్మరణ ముగిసిన తర్వాత ఆలయంలో సీతా, లక్ష్మణ, సమేత కోదండరామస్వామి చిత్రపటానికి తులసీ దళాలతో అర్చనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుని, కొబ్బరి కాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

ఒడిశా వాసి ఆత్మహత్య

చిత్తూరు, జూలై 18: కుటుంబ కలహాలతో ఒడిశా వాసి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఒడిశాకు చెందిన నీలాద్రి (56) నగరంలోని ఓ హేచరీస్‌లో కూలీగా పని చేస్తున్నాడు. భార్యతో కలసి అక్కడే నివాసముం టున్నాడు. కొన్నిరోజులుగా భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని నీలాద్రి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా నరసింహశర్మ

గంగాధరనెల్లూరు, జూలై 18: ఉమ్మడి చిత్తూరు జిల్లా పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లెకు చెందిన నరసింహశర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బంగారుపాళ్యం మండలం మొగిలి శివుని ఆలయంలో పురోహిత బ్రాహ్మణ సమాఖ్య సంఘం సమావేశం గురువారం నిర్వహించారు. నరసింహశర్మ రెండవసారి ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జగన్ ప్రభుత్వంలో అంతా అవినీతే...!

గుడిపాల, జూలై 18: జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి అవినీతి తప్ప అభివృద్ధి జరగలేదని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, మాజీ సర్పంచ్ గోవిందగౌడ్ విమర్శించారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క పథకంలోనూ ఆ పార్టీ నాయకులు దోచుకున్నారని తెలిపారు. గంజాయి, ఎర్రచందనం, గనులు, మద్యం తదితర వాటిల్లో రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని అన్నారు. అందుకే ప్రజలు వారికి సరైన బుద్ధి చెప్పారని అన్నారు. టీడీపీ నాయకులు జయరామ్ యాదవ్, సుబ్రహ్మణ్యం, హరిదాస్, రామూర్తినాయుడు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి: కలెక్టరు



కుప్పంలో వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు

కుప్పం, జూలై 18: కుప్పం నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యాధికారులను కలెక్టరు సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కుప్పం పర్యటనలో భాగంగా ఆయన తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇంటింటి సర్వే చేపట్టి కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించాలని ఆదేశించారు. గుర్తించిన వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచిత ఆపరేషన్లు చేయించాలన్నారు. కుప్పం ప్రాంతీయ వైద్యశాలతో బాటు అన్ని పీహెచ్‌సీలకు వచ్చే రోగుల పట్ల మర్యాదకరంగా మెలగాలని సూచించారు. వారికి మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జాయింట్ కలెక్టరు శ్రీనివాసులు, కడా పీడీ వికాస్‌మర్మత్, డ్వామా పీడీ రాజశేఖర్, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, డీఐఓ అనిల్‌కుమార్, టీడీపీ నాయకులు మునిరత్నం, డా.సురేష్‌బాబు, ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ విజయకుమారి, నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోటరు బిగించారు..విద్యుత్ కనెక్షన్ మరిచారు

- బోరు నుంచి ట్యాంకు వద్దకు పైపులైను లేదు
- కొంగరవారిపల్లి, ఎస్టీకాలనీ వాసులకు తప్పని నీటికష్టాలు



మోటారు బిగించి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన బోరు

కల్లూరు, జూలై 18: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కొంగరవారిపల్లి ఎస్టీకాలనీ సమీపంలో సుమారు ఏడాది క్రితం నూతనంగా బోరువేసి కొత్త మోటరు బిగించారు. అయితే విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. పైగా బోరు నుంచి ట్యాంకు వరకు పైపులైను అమర్చలేదు. దీంతో ప్రజలు తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొంగరవారిపల్లి, ఎస్టీకాలనీ గ్రామాల కోసం నిర్మించిన తాగునీటి ట్యాంకుకు సుమారు అర కిలోమీటరు దూరంలోని వడ్డిపల్లి వద్ద ఉన్న బోరు నుంచి తాగు నీరు సరఫరా అవుతోంది. ఈ బోరు నుంచి వచ్చే నీళ్లు వడ్డిపల్లి ప్రజల దాహార్తి తీరిన తర్వాతే కొంగరవారిపల్లి ట్యాంకుకు నీరు సరఫరా అవుతుంది. కొంగరవారిపల్లి వద్ద ఉన్న తాగునీటి ట్యాంకుకు ప్రత్యేకంగా బోరు లేకపోవడంతో కొంగరవారిపల్లి, ఎస్టీకాలనీ ప్రజలు చాలా ఏళ్లుగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రెండు గ్రామాల ప్రజలు తాగునీటి ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఏడాది క్రితం ఎస్టీ కాలనీ సమీపంలో జేజేఎం నిధులతో నూతనంగా బోరు డ్రిల్ చేశారు. బోరులో నీరు పుష్కలంగా పడ్డాయి. ఇకపై తాగునీటి ఇబ్బందులు రావని కొంగరవారిపల్లి, ఎస్టీకాలని ప్రజలు ఆనందించారు. అయితే నూతనంగా వేసిన బోరులో కొత్త మోటరు బిగించి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. అలాగే తాగునీటి బోరు నుంచి సుమారు 70 మీటర్ల దూరంలోని ట్యాంకు వరకు పైపులైను వేయలేదు. ఫలితంగా వారి నీటి కష్టాలు తీరలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరు మోటరుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి ట్యాంకు వరకు పైపులైను అమర్చి రెండు గ్రామాల ప్రజలు తాగునీటి ఇబ్బందులను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో విద్యుత్ కనెక్షన్ ఇస్తాం

బోరుకు మోటారు బిగించి విద్యుత్ కనెక్షన్ ఇస్తాం. ట్యాంకు వరకు పైపులైను వేసేందుకు చర్యలు తీసుకుంటాం. తాగునీరు సరఫరా చేస్తాం.

- ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గౌతమి

ఘనంగా యల్లమ్మ కొలుపు జాతర



అమ్మవారిని కీర్తిస్తున్న ఆసాది వారు

సోమల, జూలై 18: మండలంలోని నడింపల్లెలో కొలువుతీరిన యల్లమ్మ దేవత ఆలయంలో కొలుపు జాతర వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు ఉపవాసదీక్షలతో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయంలోని అమ్మవారి ఆయుధాలను, ఉత్సవమూర్తిని ఊరేగింపుగా గ్రామ సమీపంలోని గుంత చెరువు వద్దకు తీసుకెళ్లి శాస్త్రోక్తంగా గంగస్నానం చేయించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారి ఆయుధాలను, ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణలు జరిపారు. అనంతరం నడింపల్లె, కరకమంద, సూరయ్యగారిపల్లె, సోమల తదితర గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి పొంగళ్లు పెట్టారు. ఆసాదివారు అమ్మవారి చరిత్రను భక్తులకు వినిపించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని గుంత చెరువు నుంచి గ్రామ పొలిమేర వరకు బాణ సంచా వేడుకలతో, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు.

ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్



ఆర్‌ఎంపీ క్లినిక్‌లో తనిఖీలు చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్

గంగవరం, జూలై 18: మండలంలోని కలగటూరులో గల ఆర్‌ఎంపీ క్లినిక్‌ను జిల్లా వైద్యశాఖ అధికారులు గురువారం సీజ్‌చేశారు. కలగటూరులోని గోపాల్‌రెడ్డి ఆర్‌ఎంపీ క్లినిక్‌లో 10 రోజుల క్రితం ఓ వ్యక్తి వైద్యం చేయించుకున్నాడు. ఆరోగ్యం కుదుటపడకపోగా పరిస్థితి తీవ్రంగా ఉండడంతో అక్కడి నుంచి పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో మృతుడి బంధువులు కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్యశాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. వారి ఫిర్యాదుపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకట ప్రసాద్ గురువారం కలగటూరు గ్రామానికి చేరుకొని, ఆర్‌ఎంపీ క్లినిక్‌లో తనిఖీలు చేసి చుట్టుపక్కల ప్రాంతాల్లో క్షుణ్ణంగా విచారించారు. అలాగే ఆర్‌ఎంపీ క్లినిక్‌లో అనుమతిలేని వైద్యం అందించారని, పరిమితులకు మించి వ్యవహరించారని నిర్ధారణ కావడంతో ఆస్పత్రిని సీజ్ చేశారు. విచారణలో వెల్లడైన వాస్తవాలను జిల్లా అధికారులకు నివేదిక అందిస్తామని అడిషనల్ డీఎంహెచ్‌ఓ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గంగవరం వైద్యాధికారి శ్రీనివాసులు, పలువురు అధికారులు తదితరలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో రెండు పొట్టేళ్లు, మేక మృతి

కల్లూరు, జూలై 18: పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లి పంచాయతీ ఎర్రం వాండ్లపల్లిలో కుక్కల దాడిలో రెండు పొట్టేళ్లు, మేక మృతిచెందాయి. గ్రామానికి చెందిన కృష్ణయ్య బుధవారం వ్యవసాయ పొలంలో పొట్టేళ్లు మేపుతుండగా కుక్కల గుంపు దాడి చేయడంతో రెండు పొట్టేళ్లు మృతి చెందాయి. ఇదే గ్రామానికి చెందిన నారాయణకు చెందిన మేక పిల్లను వారం క్రితం కుక్కలు దాడిచేసి చంపినట్లు బాధిత రైతు తెలిపారు.

21న గురుపౌర్ణమి వేడుకలు

కల్లూరు, జూలై 18: పులిచెర్లలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈనెల 21వ తేదీన ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో ఉదయం కాగడ హారతితో వేడుకలు ప్రారంభమవు తాయని, సామూహిక పాలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహిస్తారన్నారు. తర్వాత అలంకరణ, అర్చన, మంత్రపుష్పం, సర్వదర్శనం, తీర్థప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

అశ్వవాహనంపై శ్రీవారి విహారం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

సోమల, జూలై 18: మండలంలోని కమ్మపల్లె ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గురువారం స్వామి వార్లను అశ్వవాహనంపై ఊరేగించారు. ఉదయం మూల విరాట్‌కు విశేష పుష్పాలంకరణలు చేసి అభిషేక పూజలు జరిపారు. వేద పండితులు యాగశాలలో మూల మంత్ర హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పురవీధులల్లో ఊరేగించారు. మహిళలు కర్పూర నీరాజనాలు పలికారు. ఈ కార్యక్రమాలను శంకర్ నాయుడు, భాస్కర్‌నాయుడు, రవీంద్రనాయుడు, చంద్ర శేఖర్ నాయుడు, రమేశ్‌నాయుడు తదితరులు పర్యవేక్షించారు.

భక్తి శ్రద్ధలతో చెన్నకేశవస్వామికి పూజలు

సోమల, జూలై 18: సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్నకేశవ స్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా భక్తులు స్వామివారికి విశేషపూజలు నిర్వ హించారు. బుధవారం రాత్రి జాగరణతో స్వామి వారికి విశేష పుష్పాలంకరణలు చేసి కొలువుదీర్చారు. గురువారం ఉదయం త్రయోదశి ఉపవాస దీక్షలు విరమించి స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు పొంగళ్లు

శుక్రవారం ఆలయ సమీపంలోని పోతురాజు ఆలయం వద్ద సోమల, కరకమంద, చెన్నయ్యగారిపల్లె, దామలచెరువు, గూబలవారిపల్లె, సూరయ్యగారిపల్లె, గట్టువారిపల్లె భక్తులు పొంగళ్లు పెట్టనున్నారు.

కుష్ఠు నిర్మూలనే ధ్యేయం

సోమల, జూలై 18: కుష్ఠు వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా వైద్య సిబ్బంది పని చేయాలని సోమల, పెద్దఉప్పరపల్లె వైద్యాధికారులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, బాలాజీ పేర్కొన్నారు. గురు వారం సోమల పీహెచ్‌సీలో సోమల, పెద్దఉప్పరపల్లె, కందూరు పీహెచ్‌సీల వైద్యసిబ్బందికి కుష్ఠుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 18నుంచి ఆగస్టు 2వ వరకు కుష్ఠి వ్యాధి నివారణకు ప్రత్యేక సర్వేలు చేయాలన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యసిబ్బంది అమరనాథ్, కుమార్, బాలాజీ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

చిత్తూరు (సెంట్రల్), జూలై 18: జీవో నంబరు 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే వర్తింపజేయాలని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా విద్యార్థులకు ఇచ్చిన హామీని నెరవేర్చి ఫీజు రీయింబర్స్‌మెంట్ 2024-25 నుంచి అమలు చేయాలని ఆయన కోరారు.

కోదండరామాలయ భూముల రక్షణకు శ్రీకారం





ఆలయ భూముల సర్వేను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు, పునర్నిర్మాణానికి నోచుకోని కోదండరామాలయం

రామకుప్పం, జూలై 18: రామకుప్పంలోని కోదండరామాలయ భూముల పరిరక్షణకు రెవిన్యూ అధికారులు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఆదేశాలతో రెవిన్యూ అధికారులు, సిబ్బంది మండల పరిధి మిట్టపల్లె, తిమ్మసముద్రం వద్ద గల ఆలయ భూముల సర్వే కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. సర్వే కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, టీడీపీ నాయకులు నందారెడ్డి, గజేంద్ర, వెంకటరమణ, మురళీలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి 125ఎకరాల భూములున్నా దశాబ్దాలుగా ఆలయంలో స్వామివారికి ధూప, దీప, నైవేద్యాలు కరువయ్యాయని విచారం వ్యక్తం చేశారు. ఆలయానికి సంబంధించిన 125ఎకరాల భూములు స్థానిక వైసీపీ నాయకుల ఆధీనంలో ఉన్నాయని ఆరోపించారు. ఏడాది క్రితం ఆలయాన్ని పునర్నిర్మిస్తామంటూ ఆలయాన్ని పాక్షికంగా కూల్చివేశారని గుర్తుచేశారు. తర్వాత పనులు ప్రారంభించలేదన్నారు. ఈ క్రమంలో ఆలయ భూములను పారదర్శకంగా వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఆదాయవనరులు పెంపొందించి ఆలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇందుకోసం పారదర్శకంగా సర్వే నిర్వహించి, హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

వైసీపీ పాలనలో సహజ వనరుల దోపిడీ : ఎమ్మెల్యే

చిత్తూరు సిటీ, జూలై 18: ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన భూదందాలు, సహజ వనరుల దోపిడీపై ప్రభుత్వం త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం బీవీ రెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రూ.35.576 కోట్ల విలువైన 1.75 లక్షల ఎకరాలు ఆక్రమణకు గురైందన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో 10 వేల ఎకరాలు, ఇసుక దందాలో సుమారు రూ.9,750 కోట్లు వైసీపీ నేతలు దోచుకున్నారని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వైసీపీ నేతలు భూ దోపిడీకి పాల్పడ్డారన్నారు. విశాఖలో రామానాయుడు స్టూడియో భూములు, వృద్ధాశ్రమానికి ఇచ్చిన హయగ్రీవ భూములను, తిరుపతి, రేణిగుంటలోని మఠం భూములను, పుంగనూరులో 582 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని చెప్పారు. చిత్తూరులో 782 ఎకరాలు, ఒంగోలులో నకిలీ పత్రాలతో రూ.101 కోట్ల ఆస్తి కాజేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. వైసీపీ కార్యాలయాల కోసం రెండేసి ఎకరాల చొప్పున నామమాత్రపు రుసుంతో రూ.300 కోట్ల విలువైన భూమిని 33 ఏళ్లకు లీజుకు తీసుకున్నారని చెప్పారు.

వైభవంగా రుద్ర ఏకాదశి పూజలు





హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు, విశేష అలంకరణలో అన్నపూర్ణదేవీ, కాశీవిశ్వేశ్వరస్వామి

రామకుప్పం, జూలై 18: రామకుప్పంలోని అన్నపూర్ణదేవీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం రుద్ర ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. వేదపండితులు సందీప్‌శర్మ, నాగరాజ శర్మల ఆధ్వర్యంలో పండితులు మహాగణపతి పూజతో పూజలకు అంకురార్పణ చేశారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. తర్వాత స్వస్తి పుణ్యాహవచనం, దేవనంది, పంచగవ్యం, పంచగవ్య హోమం, రుత్వికవరణం, కుష్మాండప్రాయశ్చిత్తం, మహాన్యాస స్తోత్రం, ప్రాకారణ రుద్రేకాదశి రుద్రహోమాలు నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం కళాశాల్లోని పుణ్యజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ పూజల సందర్భంగా భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు. అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఎమ్మెల్యే సార్..ధన్యవాదాలు!

- 'డయల్ యువర్ ఎమ్మెల్యే' సమస్యల పరిష్కారంపై బాధితుల హర్షం
- గతవారం అందిన ఫిర్యాదుల్లో 23 పరిష్కారం
- ఈ వారం 48 ఫిర్యాదులు



బాధితుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు, జూలై 18: వీధిలైట్లు లేవని, కాలువలు శుభ్రం చేయలేదని గత వారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఫిర్యాదు చేశానని, మరుసటి రోజు సమస్యలు పరిష్కారమయ్యాయని కొంగారెడ్డిపల్లె గురునగర్‌కాలనీకి చెందిన మహీంధర్ సంతోషం వ్యక్తం చేశాడు. ఫోన్ చేసి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు ధన్యవాదాలు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే నగరపాలక కార్యాలయంలో డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు ఫోన్ ద్వారా నేరుగా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మొత్తం 48 ఫిర్యాదులు అందగా వాటిలో నగరపాలక సంస్థకు 31, రెవెన్యూకు 5, పోలీసు శాఖకు 7, పంచాయతీరాజ్‌కు 2, ట్రాన్స్‌కో, హౌసింగ్, సహాయం కోసం ఒక్కో అర్జీ వంతున అందాయి. అనంతరం ఎమ్మెల్యే మేయర్ అముదతో కలిసి నియోజకవర్గ అధికారులతో సమీక్షించారు. గతవారం అందిన ఫిర్యాదుల్లో 23 పరిష్కరించడంపై అభినందించారు. మిగిలిన 16 సమస్యలను వేగంగా పరిష్కరించాలని, ఈ వారం అందిన ఫిర్యాదులపైనా దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ అరుణ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను పూజించండి

పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరులను కాపాడుకోవడంలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన వినాయక విగ్రహాలనే పూజించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వినాయక పండగ సందర్భంగా తనవంతుగా 25వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తానన్నారు.

మామిడి యాజమాన్య పద్ధతులపై శిక్షణ



కొమ్మల కత్తిరింపుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తవణంపల్లె, జూలై 18 : మామిడి కోతల అనంతరం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అరగొండలో గురువారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మామిడి తోటల్లో కోతల అనంతరం చీడపీడల నివారణ, కొమ్మల కత్తరింపు, ఎరువుల వాడకం తదితర యాజమాన్య పద్ధతులపై ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట, ఉలవలు, అలసంద వంటి విత్తనాలు చల్లి ఎరువులుగా వాడుకోవాలన్నారు. శాస్త్రవేత్త రెడ్డిరాము, ఉద్యాన అధికారి సాగరిక, ఏవో ప్రవీణ్ పాల్గొన్నారు.

పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

చిత్తూరు (సెంట్రల్), జూలై 18: జీవో నంబరు 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా విద్యార్థులకు ఇచ్చిన హామీని నెరవేర్చి ఫీజు రీయింబర్స్‌మెంట్ 2024-25 నుంచి అమలు చేయాలని కోరారు.

ముగిసిన గంగ జాతర

విజయపురం, జూలై 18: మండలంలోని కళియంబాకంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గంగమ్మ జాతర గురువారం ముగిసింది. గంగమ్మకు పూజలు నిర్వహించి, మేళతాళాల నడుమ ఊరేగించారు. గ్రామస్తులు గంగమ్మకు పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. యువత మ్యూజిక్, డ్యాన్సులతో మోతెక్కించారు.

దుస్థితిలో ఆలపాకకండ్రిగ - జీఎంపురం రోడ్డు



విజయపురం, జూలై 18: మండలంలోని ఆలపాకకండ్రిగ - జీఎంపురం, బూచివానత్తం రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. చినుకు పడితే రోడ్లు బురదమయంగా మారుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలకులు వీటిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

అల్లాగుంట దళితవాడకు సీసీ రోడ్డు కలేనా?



కార్వేటినగరం, జూలై 18: ఎమ్మెల్యే థామస్ సొంత గ్రామం అల్లాగుంట దళితవాడకు సీసీ రోడ్డు కలగా మిగులుతోంది. పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారి నుంచి ఆ గ్రామానికి వెళ్లాలంటే మట్టి రోడ్డే గతి. సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విన్నవించినా లాభం లేకపోయింది. రోడ్డుకోసం స్థానిక రైతులు తమ సొంత భూములను సైతం వదిలిపెట్టారు. ఎమ్మెల్యే థామస్ దీనిపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెత్త బుట్టల పంపిణీ



నింద్ర, జూలై 18: మండలంలోని శ్రీరామపురం, నెట్టేరి, ఇరుగువాయి, ఐఆర్‌కండ్రిగ గ్రామాల్లో గురువారం చెత్త బుట్టలు పంపిణీ చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సర్పంచులు సూచించారు. సర్పంచ్‌లు జయమ్మ, సరోజమ్మ, నాయకులు మనోహర్‌నాయుడు, బాబుయాదవ్, జగన్, కృష్ణయ్య, కాటయ్య, మనోజ్ యాదవ్, లింగయ్య, అప్పారావు, ప్రసాద్, బుజ్జి, స్వయరాజ్, ఇళయరాజా, గణేష్‌యాదవ్, రవియాదవ్ పాల్గొన్నారు.

సామన్నగుంటలో కొబ్బరి మొక్కల తొలగింపు

పాలసముద్రం, జూలై 18: మండలంలోని నరసింహాపురం గ్రామం సామన్నకుంటలో వైసీపీ నేత సాగుచేస్తున్న కొబ్బరి మొక్కలను గురువారం అధికారులు తొలగించారు. కుంటను ఆక్రమించుకున్న విషయమై ఈ నెల 15వ తేదీన 'సామన్నకుంటను ఆక్రమించేశారు' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో తహసీల్దార్ జయలక్ష్మి, వీఆర్వోలు శ్రీను, ప్రవీణ్ వెళ్లి పరిశీలించారు. అక్కడున్న కొబ్బరి మొక్కలను తీసివేయించారు. సమగ్ర నివేదికను నగరి ఆర్డీవోకు పంపినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించండి

పాలసముద్రం, జూలై 18: మండలంలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని డాక్టర్ మోహనకృష్ణ కోరారు. గురువారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో ఆయన సమావేశమయ్యారు. స్పర్శలేని మచ్చలు, కనురెప్పలు తెల్లగా మారుతున్న, ముఖం, శరీరంపై మచ్చలు ఏర్పడిన వారిని గుర్తించాలన్నారు. వ్యాధిని ప్రారంభంలోనే గుర్తిస్తే అరికట్టవచ్చని తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే జరిమానా



పూతలపట్టు, జూలై 18: మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానా విధిస్తామని సీఐ సుదర్శన్ ప్రసాద్ హెచ్చరించారు. గురువారం ఆయన రంగంపేట క్రాస్‌రోడ్డు సమీపాన వాహనాలు తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, వాహనాల రికార్డులు సక్రమంగా ఉండాలని అన్నారు.

నేడు పూతలపట్టు మండల సమావేశం

పూతలపట్టు, జూలై 18: పూతలపట్టు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరుగుతుందని ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎమ్మెల్యే మురళీ మోహన్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఒడిశా వాసి ఆత్మహత్య

చిత్తూరు, జూలై 18: కుటుంబ కలహాలతో ఒడిశా వాసి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఒడిశాకు చెందిన నీలాద్రి (56) నగరంలోని ఓ హేచరీస్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. భార్యతో కలసి అక్కడే నివాసముంటున్నాడు. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని నీలాద్రి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వాహనాల వేలం

నగరి జూలై18: సెబ్ కార్యాలయంలో పట్టుబడిన వాహనాలను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ మాధవి పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

రాయితీ విత్తనాల పంపిణీ

బంగారుపాళ్యం, జూలై 18: మండలంలోని నలగాంపల్లి పశువైద్య కేంద్రంలో పాడి రైతులకు రాయితీపై మొక్కజొన్నలు, జొన్నలు పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ మాట్లాడుతూ రైతులకు 75శాతం సబ్సిడీతో మొక్కజొన్నలు 5 కేజీలు, జొన్నలు 5 కేజీలు పంపిణీ చేశామన్నారు. సర్పంచులు షీబా స్వామిదాస్, కోకాప్రకాష్ నాయుడు, ఎంపీటీసీ ప్రసన్నకుమారి, జనార్దన్ గౌడ్, ధరణి, డాక్టర్ ఆసిఫ్, డాక్టర్ ఝాన్సీ పాల్గొన్నారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

చిత్తూరు కల్చరల్, జూలై 18: నగరంలో శనివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. కట్టమంచి విశ్వసాయి షిరిడిసాయి బాబా ఆలయంలో ఆలయ ట్రస్టీ, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు దంపతుల ఆధ్వర్యంలో బాబాకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. గిరింపేట జీకే నగర్, కుమ్మర వీధి షిరిడిసాయి బాబా ఆలయాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

రేపు గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్, జూలై 18: గిరింపేట చెంగల్‌రాయకొండ శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరాలయంలో శనివారం పౌర్ణమి గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో బాబాకు పల్లకిసేవ నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నేడు ఆడిమాస తొలి శుక్రవార పూజలు

చిత్తూరు కల్చరల్, జూలై 18: గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం తొలి శుక్రవార పూజలు నిర్వహించనున్నారు. చవటపల్లె కనకదుర్గాలయంలోనూ పూజలు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పేదలకు అన్నదానం



గుడిపాల, జూలై 18: మండలంలోని అన్నక్యాంటీన్‌లో గురువారం తుమ్మల నాగమ్మ, కృష్ణమనాయుడు వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు భారతి, విద్యావతి భోజన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, రవి నాయుడు, గోవింద గౌడ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో అంతా అవినీతే : టీడీపీ

గుడిపాల, జూలై 18: జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి అవినీతి తప్ప అభివృద్ధి జరగలేదని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, మాజీ సర్పంచ్ గోవిందగౌడ్ విమర్శించారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క పథకంలోనూ ఆ పార్టీ నాయకులు దోచుకున్నారని తెలిపారు. గంజాయి, ఎర్రచందనం, గనులు, మద్యం తదితర వాటిల్లో రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని అన్నారు. అందుకే ప్రజలు వారికి సరైన బుద్ధి చెప్పారని అన్నారు. టీడీపీ నాయకులు జయరామ్ యాదవ్, సుబ్రహ్మణ్యం, హరిదాస్, రామూర్తినాయుడు పాల్గొన్నారు.

నేడు ముత్తుమారియమ్మ తిరునాళ్ల

గుడిపాల, జూలై 18: ఆడినెల మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని గొల్లమడుగు పంచాయతీ చింతగుంటూరు గ్రామంలో శుక్రవారం మారియమ్మ తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ఊరేగిస్తారన్నారు. కుప్పిగానిపల్లె పంచాయతీ కండిగ గ్రామంలో మునేశ్వరస్వామి నూతన విగ్రహప్రతిష్ఠ, మహాకుంబాభిషేకాన్ని ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా నరసింహాశర్మ



గంగాధరనెల్లూరు, జూలై 18: చిత్తూరు ఉమ్మడి జిల్లా పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లె గ్రామానికి చెందిన నరసింహాశర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బంగారుపాళ్యం మండలం మొగిలి శివుని ఆలయంలో పురోహిత బ్రాహ్మణ సమాఖ్య సంఘం సమావేశం గురువారం నిర్వహించారు. నరసింహాశర్మ రెండవసారి ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



నగరి, జూలై18: మండల పరిధిలోని వెంకట నరసింహరాజుపేట రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ రవి తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై రైతులకు అవగాహన

నగరి, జూలై18: నగరి పీఏసీఎస్ పరిధిలో గల రైతులకు ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాబృందం వారు పాటల ద్వారా రూరల్ బ్యాంకు లావాదేవీల గురించి వివరించారు. బ్యాంకు సిబ్బంది తులసిపిళ్లై, ఆనందన్, సందీప పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీకలు చేనేత వస్త్రాలు



చేనేత వస్త్రాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మేయర్

చిత్తూరు కల్చరల్, జూలై 18: చేనేత వస్త్రాలు మన సంస్కృతికి, సంప్రదాయానికి ప్రతీకలుగా నిలిచాయని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఆయన మాజీ మేయర్ కఠారి హేమలతతో కలిసి ప్రారంభించారు. కళా ప్రదర్శనను పరిశీలించి, కళాకారులను అభినందించారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురుకుల పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తాం



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే థామస్

గంగాధరనెల్లూరు, జూలై 18: బాలికల గురుకుల పాఠశాలకు అవసరమైన సౌకర్యాలను త్వరలో కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ వెల్లడించారు. గంగాధరనెల్లూరు (సర్విరెడ్డిపల్లెకు సమీపంలో గల) బాలికల గురుకుల పాఠశాలను గురువారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దమయంతితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలను పరిష్కరించి, సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. మెడికల్ కిట్‌లను సైతం అందజేస్తానని హామీ ఇచ్చారు. రాత్రి బాలికలతో కలిసి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు.

వైసీపీ పాలనలో సహజ వనరుల దోపిడీ : ఎమ్మెల్యే

చిత్తూరు సిటీ, జూలై 18: ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన భూదందాలు, సహజ వనరుల దోపిడీపై ప్రభుత్వం త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం బీవీ రెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రూ.35.576 కోట్ల విలువైన 1.75 లక్షల ఎకరాలు ఆక్రమణకు గురైందన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో 10 వేల ఎకరాలు, ఇసుక దందాలో సుమారు రూ.9,750 కోట్లు వైసీపీ నేతలు దోచుకున్నారని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వైసీపీ నేతలు భూ దోపిడీకి పాల్పడ్డారన్నారు. విశాఖలో రామానాయుడు స్టూడియో భూములు, వృద్ధాశ్రమానికి ఇచ్చిన హయగ్రీవ భూములను, తిరుపతి, రేణిగుంట ప్రాంతంలోని మఠం భూములను, పుంగనూరులో 582 ఎకరాల భూమిని కూడా ఆక్రమించుకున్నారని చెప్పారు. చిత్తూరులో 782 ఎకరాలు, ఒంగోలులో నకిలీ పత్రాలతో రూ.101 కోట్ల ఆస్తి కాజేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. రుషికొండలో రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టి ప్రజాధనాన్ని వృథా చేశారని అన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయాల కోసం రెండేసి ఎకరాల చొప్పున నామమాత్రపు రుసుంతో రూ.300 కోట్ల విలువైన భూమిని 33 ఏళ్లకు లీజుకు తీసుకున్నారని చెప్పారు. మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు వరలక్ష్మి, ఫైరోజ్, జాఫర్, దాడి మున్న, గోళ్ల హరిప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే టీడీపీ ధ్యేయం




హైవే అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జూలై 18: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని వేము ఇంజినీరింగ్ కళాశాల నుంచి కొత్తకోటకు వెళ్లే జాతీయ రహదారిని నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుచూపు లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాలకు మార్గం లేకుండా పోయిందన్నారు. పాకాల, పూతలపట్టు, పెనుమూరు, ఐరాల మండలాలకు చెందిన ప్రజలు సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రహదారుల్లో ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే 5 కి.మీ. మేర చుట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. త్వరలో సీఎం చంద్రబాబుతో సంప్రదించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని, బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నాయకులు గిరిధర్ బాబు, బాబు రావు, చంద్రబాబు నాయుడు, జయప్రకాష్, మంజునాథ పాల్గొన్నారు.

మా పేర్లు ఎందుకు లేవు?

భజన చేసేవారికే పదవులా?



చెవిలో పూలు పెట్టుకుని, భజన చేస్తూ నిరసన తెలుపుతున్న నేతలు

చిత్తూరు సిటీ, జూలై 18: నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ అధిష్ఠానం ఐవీఆర్‌ఎస్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారని, అయితే నగరి మున్సిపాలిటీలో అంకిత భావంతో పనిచేస్తున్న 1వ వార్డుకు చెందిన తనను, 3వ వార్డుకు చెందిన లత పేర్లను ఐవీఆర్‌ఎస్‌లో లేకుండా చేయడం దారుణమని నగరికి చెందిన టీడీపీ నాయకుడు రామానుజం చలపతి అన్నారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో చెవిలో పూలు పెట్టుకుని, భజన చేస్తూ వినూత్న నిరసన తెలిపారు. నిజంగా పార్టీకోసం పనిచేసేవారి వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలు తెప్పించుకుని నామినేటెడ్ పోస్టులు, ఇతర గుర్తింపు ఇవ్వాలని కోరారు. కాగా కొందరు నాయకులకు భజన చేసేవారికే నామినేటెడ్ పోస్టులు ఇచ్చేందుకు ప్రత్నిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌లు నిజం గ్రహించి పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు కన్నెమ్మ, అలిమేలు, ఆదెమ్మ పాల్గొన్నారు.

టీడీపీ నేత చంద్రమ్మకు ఎమ్మెల్యే నివాళి



వెదురుకుప్పం, జూలై 18: వేణుగోపాలపురం కాలనీకి చెందిన టీడీపీ నాయకురాలు చంద్రమ్మ (57)కు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ నివాళి అర్పించారు. ఇటీవల ఆమె అనారోగ్యంతో మృతి చెందడంతో చిత్రపటానికి పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. టీడీపీ నేతలు బీఎం రవి, పి.మోహన్‌మురళి, పోటుగారి గంగయ్య, నేసనూరు మునిచంద్రారెడ్డి, కోనేరు చెంగల్రాయరెడ్డి, రాజగోపాల్, వరప్రసాద్ ఆయన వెంట ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పీఎం ఫొటోలు

ప్రభుత్వ కార్యాలయాల్లో పీఎం మోదీ ఫొటోలను పెట్టాలని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ గురువారం అందజేశారు. టీడీపీ, బీజేపీ నాయకులతో కలసి తహసీల్దార్, ఎంపీడీవో, పోలీసుస్టేషన్, వెలుగు కార్యాలయాల్లో ఇచ్చారు. వెదురుకుప్పంకు వచ్చిన ఎమ్మెల్యే థామస్‌కు కూడా అందించారు.

ఎమ్మెల్యేకు గాండ్ల సంఘం సన్మానం

కార్వేటినగరం : కార్వేటినగరం గాండ్ల సంఘం అధ్యక్షుడు మోహన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను ఘనంగా సన్మానించారు. సమస్యలను పరిష్కరించాలని సంఘ నాయకులు కోరారు.

బీసీజీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోండి



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్, జూలై 18: అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌తో టీబీ వ్యాధికి చెక్ పెట్టవచ్చునని, అర్హులందరూ వేసుకోవాలని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తెలిపారు. గురువారం అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ డే సందర్భంగా కాజూరు యూపీహెచ్‌సీ పరిధిలోని టెలిఫోన్ కాలనీ, గిరింపేట తదితర ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. 18 సంవత్సరాలు పైబడిన, షుగర్ వ్యాధిగ్రస్తులు వేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులు ఇంట్లో ఉన్న 18 సంవత్సరాలు పైబడిన వారు తప్పక వ్యాక్సిన్ వేయాలన్నారు.

గుండెపోటుతో సీనియర్ పాత్రికేయుడి మృతి



ప్రసాద్ (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, జూలై 18: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీకి చెందిన సీనియర్ పాత్రికేయుడు జి. ప్రసాద్ (55) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈయన మండల విలేకరిగా పనిచేశారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పలువురు నాయకులు, పాత్రికేయులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, ధరణి, జనార్దన్ గౌడ్, లోకనాథం నాయుడు, జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా ఉన్నారు.

రాళ్లు తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

పాలసముద్రం, జూలై 18: మండలంలోని సింహరాజుపురం పంచాయతీకి చెందిన వైసీపీ నేత సుబ్రహ్మణ్యం రెడ్డి గురువారం కట్రాళ్లు (సైజ్ స్టోన్స్)ను పాలసముద్రానికి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా టీడీపీ నాయకులు పట్టుకున్నారు. బిల్లులు లేకపోవడంతో నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీన పరచుకుని తహసీల్దార్ జయలక్ష్మికి అప్పగించారు. ఆమె జిల్లా మైనింగ్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు.

స్కూల్ కిట్ల పంపిణీ

గంగాధరనెల్లూరు, జూలై 18: గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లె హైస్కూల్లో ప్రభుత్వం తరపున పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలతో పాటు యూనిఫామ్ దుస్తులతో కలిపిన కిట్ బ్యాగ్‌ను గురువారం ఎమ్మెల్యే థామస్ విద్యార్థులకు పంపిణీ చేశారు. తాను ఎమ్మెల్యే అవుతానని దేవుని సాక్షిగా ఎప్పుడు అనుకోలేదన్నారు. ఈ నియోజకవర్గంలో తానేదో దోచుకోవాలనే లక్ష్యంతో కాని, ఇంకెవరి మీదనో కక్ష తీర్చుకోవాలనే కారణంతోనో ఎమ్మెల్యేగా రాలేదని, రోజుకు కోటి రూపాయల ఆదాయాన్ని వదిలేసి ప్రత్యేక మార్పు తీసుకుని రావాలి, ఇక్కడ ప్రజలకు సేవ చేసి ఆదరాభిమానాలు చూరగొనాలనే సంకల్పంతోనే ఎమ్మెల్యేగా ఉన్నానని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే దేశాన్ని శాసిస్తున్నారు

పెనుమూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే నేడు దేశంలో అనేక శాఖల్లో అధికారులుగా పాలిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. గురువారం ఆయన పెనుమూరు జడ్పీ హైస్కూల్‌లో ప్రభుత్వం అందించే విద్యా సామగ్రి కిట్టు పంపిణీ చేశారు. నోబెల్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే థామస్ ఆవిష్కరించారు.

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలివ్వాలి

నగరి, జూలై18: గ్రామ పంచాయతీల్లోని గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు ఇప్పించాలని నగరి ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రన్ మాట్లాడుతూ ఏడాది కాలంగా పంచాయతీ కార్మికులకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. గత ప్రభుత్వం 680 జీవో ప్రకారం రూ.10వేలు జీతం ఇస్తామని చెప్పి అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం దారుణమన్నారు. గ్రీన్ అంబాసిడర్ నాయకులు దేవప్ప, సెల్వం, జ్ఞానమణి పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ



నగరి జూలై 18: ఓంశక్తి ఆలయంలో మందిర వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పేద బలహీన వర్గాల వారికి కుట్టు మిషన్లు, ఇడ్లీ పాత్రలు, చీరలు పంపిణీ చేశారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, 1008 కుంకుమార్చన, 1008 పుష్పార్చనలు, 136 మంది మహిళా భక్తులు పూజలు చేశారు. తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, గంగాధర్ జ్యోతినాయుడు, జయరాజు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి కుర్చీల వితరణ



వెదురుకుప్పం, జూలై 18: మండల విద్యాశాఖ కార్యాలయానికి రెంటాలచేను మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీఎస్ రేణుకాదేవి పది కుర్చీలను వితరణగా ఇచ్చారని ఎంఈవో దామోదరం గురువారం తెలిపారు. దాతకి కృతజ్ఞతలు తెలియజేశారు.

చెన్నకేశవస్వామికి పూజలు

సోమల, జూలై 18: సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్నకేశవ స్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా భక్తులు స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి జాగరణతో స్వామి వారికి విశేష పుష్పాలంకరణలు చేసి కొలువుదీర్చారు. గురువారం ఉదయం త్రయోదశి ఉపవాస దీక్షలు విరమించి స్వామి వారిని దర్శించుకున్నారు.